మోడీ దుష్టపాలనకు చరమగీతం పాడాలి

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మద్ది కృష్ణ

విశాలాంధ్ర - శృంగవరపుకోట: మతోన్మాద, ప్రజావ్యతిరేక, నిరంకుశ బీజేపీని సాగనంపి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మద్ది కృష్ణ ప్రజలకు పిలుపునిచ్చారు. ఎస్.కోట మండలంలోని ఎస్.కోట, కాపుసొంపురం, పెదఖండేపల్లి, రాజీపేట, బొడ్డవర తదితర గ్రామాల్లో సీపీఐ, సీపీఎం నేతలు ప్రచారభేరీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ నేత కృష్ణ మాట్లాడుతూ మోడీ తొమ్మిదేళ్ల పాలనలో సాధించిన అభివృద్ధి శూన్యమని, ప్రభుత్వ రంగ సంస్థలు విశాఖ స్టీల్‌ప్లాంట్, రైల్వే, ఎల్.ఐ.సీ, బ్యాంకులు, ఓడరేవులతో పాటు వ్యవసాయాన్ని కూడా కార్పొరేట్ శక్తులైన అదానీ, అంబానీ లాంటి పారిశ్రామిక వేత్తలకు ధారాదత్తం చేసే కుట్రలను అమలు చేస్తున్నారని, నిరుద్యోగులకు ప్రతియేటా 2కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామని ఇచ్చిన హామీని బీజేపీ నిలుపుకోలేదని..పైగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను ఊడగొట్టే పనులకు శ్రీకారం చుట్టారని ఆరోపించారు. మోదీ దుష్టపాలనకు చరమగీతం పాడాలని, రాష్ట్రంలోని వైసీపీ పాలనలో విద్యుత్, బస్సు ఛార్జీలు, నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని విమర్శించారు. సీపీఐ మండల కార్యదర్శి మోపాడ మధు, సీపీఎం మండల కార్యదర్శి మద్దిల రమణలు మాట్లాడుతూ దేశంలో లౌకికవాదం కాపాడుకోవడం కోసం బీజేపీపై కమ్యూనిస్టు పార్టీలు చేస్తున్న పోరాటంలో ప్రజలు కలిసి రావాలని కోరారు. ఈ ప్రచారభేరీ కార్యక్రమంలో సీపీఐ నేతలు కండిపల్లి భీముడు, వాడపల్లి గోపి, ఎన్.నారాయణ రావు, అచ్చిం నాయుడు, బాలు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సీతంలో "మేధోసంపత్తి దినోత్సవ" వేడుకలు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: స్థానిక గాజులరేగ పరిధిలో గల సీతం ఇంజనీరింగ్ కళాశాలలో ప్రపంచ మేధో సంపత్తి దినోత్సవాన్ని పురస్కరించుకొని కార్యశాల నిర్వహించారు. ప్రపంచ మేధోసంపత్తి దినోత్సవం-2023 యొక్క థీమ్ ఉమెన్ అండ్ ఐపి ఏసెలేరేటింగ్ ఇన్నోవేషన్ అండ్ క్రియేటివిటీలో భాగంగా ఈ కార్యశాల నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఐ.పి.ఎఫ్.సి, టి.ఐ. ఎస్.సి. సీనియర్ రీజనల్ మేనేజర్, హెడ్ డాక్టర్ విజయ్ కుమార్ సాహూ ముఖ్య అతిధిగా విచ్చేసారు. ఆయన మాట్లాడుతూ భారత దేశానికి ఆవిష్కరణల యొక్క ఆవశ్యకతను తెలియజేశారు. ప్రతి విద్యార్థి తన పరిధిని దాటి ఆలోచించి ఆవిష్కరణలు చేయాలని మేధో సంపత్తి చదువుకు, పరిశ్రమలకు మధ్య వారధిగా పనిచేస్తు ందని తెలిపారు. డి.ఎస్.ఎన్.ఎల్.యూ. డైరెక్టర్, అకాడమిక్ ఎఫైర్ అండ్ రీసెర్చ్ ప్రొఫెసర్ దయానందమూర్తి మాట్లాడుతూ పెద్ద పరిశ్రమలన్నీ ఒకప్పటి స్టార్టప్స్ అని తెలిపారు. స్త్రీలకు పేటెంట్స్ చేయటానికి ప్రభుత్వం ఇస్తున్న రాయితీలను వివరించారు. సీతం కళాశాలలో ఐదుగురు ఉపాధ్యాయులు పేటెంట్స్ పొందినందుకు గాను యాజమాన్యం ఒక్కరికి వెయ్యి రూపాయలు విలువగల చెక్కులను అందించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వి.రామ మూర్తి, కళాశాల డీన్ డాక్టర్ వై.నరేంద్ర కుమార్, డిపార్ట్మెంట్ ఆఫ్ మేనేజ్మెంట్ స్టడీస్ హెచ్.ఓ.డి.డాక్టర్ ఎస్.వరూధిని పాల్గొన్నారు. ఈ కార్యశాల చివరలో ముఖ్య అతిథులను ఘనంగా సత్కరించారు. అలాగే వినికిడి లోపం ఉన్న వారికి వినికిడి పరికరాలను పంపిణీ చేశారు.

రక్షణ గోడ నిర్మాణ పనులు ప్రారంభం

విశాలాంధ్ర - డెంకాడ: డెంకాడ గ్రామపంచాయతీ పరిధిలోని చేపల ఖానా, ఎస్‌బీఐ దగ్గర పెద్ద కాలువకి రక్షణ గోడ పనులను పీఏసీఎస్ చైర్మన్ రంగలి కనక సింహాచలం ఆధ్వర్యంలో మంగళవారం ప్రారంభించారు. ఈ రక్షణ గోడ వలన గ్రామ ప్రజలకు ఉప యోగకరంగా ఉంటుందని చాలా సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న ఈ రక్షణ గోడ పనులను ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందని గ్రామ ప్రజలు సంతోషిస్తున్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయమే మేలు

విశాలాంధ్ర - గరివిడి: మండలంలో రేగటి అగ్రహారం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది గ్రామసభ, ర్యాలీ నిర్వహించారు. నవధాన్యాలు సాగు నేలతల్లి బాగు అంటూ రైతులందరికీ వివరించారు. ప్రతి రైతు అంతర పంటలు వేసి అంతర పంటల ద్వారా ఆదాయాన్ని పెంపొందించుకోవచ్చు అని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కుప్ప నాగమణి అన్నారు. వరి నాట్లు వేయడం వలన మంచి పోషకాలు అంది పంట దిగుబడి బాగా వస్తుందని ఎటువంటి యూరియా డిఏపి వేయనవసరం లేదని అన్నారు. దీనివలన రైతుకు ఖర్చు తగ్గి దిగుబడి ఎక్కువ వస్తుందని భూసారం బాగుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రేగటి అగ్రహారం ఎంపీటీసీ కదుముల రాంబాబు, నీలాద్రిపురం నాయకులు పంచాయతీ సెక్రటరీ త్రినాథరావు, శ్యామల పాల్గొన్నారు.

భోజన కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: మధ్యాహ్న భోజనం పథక కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఏపీ శాసనసభ ఉపసభాపతి, నియోజకవర్గ శాసనసభ్యులు కోలగట్ల వీరభద్ర స్వామి అన్నారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకుల సంఘం (ఏఐటీయూసీ), జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.మురళీధర్‌రావు, కె.స్రవంతి ఆధ్వర్యంలో కోలగట్లను మంగళవారం ఆయన నివాసం వద్ద కలిశారు. తమ విజ్ఞప్తికి స్పందించి, ఇస్కాన్ సంస్థ నుంచి వంటలు చేసే బాధ్యతను తిరిగి నిర్వాహకులకే అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, సత్కారం చేశారు. అనంతరం పలు పెండింగ్ సమస్యలను ఆయన దృష్టికి తీసుకొస్తూ వినతిపత్రం అందించారు. ప్రస్తుతం గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగినందువల్ల, రాయితీపై సిలిండర్లు అందించాలని కోరారు. పెరిగిన నిత్యావసరాల ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. 9, 10 తరగతుల పిల్లల హాజరు బట్టి గౌరవ వేతనం చెల్లించాలని కోరారు. సమస్యల విషయంలో నిర్వాహకులకు న్యాయం జరిగేలా ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి తగు చర్యలు తీసుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు కోశాధికారి పెంకి లక్ష్మి, ఉంగరాల జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు ఒకటవ తేదీనే జీతాలు ఇవ్వాలి

ఏపీ జేఏసీ చైర్మన్ రమణ రాజు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: ఉద్యోగులకు ఒకటవ తేదీనే జీతాలు, పెన్షన్లు చెల్లించాలని కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికుల సమస్యల పరిష్కరించాలని కోరుతూ 48వ నిరసన కార్యక్రమంలో భాగంగా మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఏపీ జేఏసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ రమణ రాజు మాట్లాడుతూ సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని, ఉద్యోగులకు ఒకటవ తేదీనే జీతాలు, పెన్షన్లు చెల్లించాలన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెన్యువల్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి విజయ్ కుమార్, కోశాధికారి పివి పద్మనాభం, టి.గోవింద్, పి.బాను మూర్తి తదితరులు పాల్గొన్నారు. ఏపీ జేఏసీ అమరావతి నిరసన కార్యక్రమాలకు ఏఐటీయూసీ, సిఐటియు మద్దతు తెలిపింది. మంగళవారం ఏపీజేఏసీ అమరావతి ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద జరిగిన నిరసన కార్యక్రమానికి ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఎస్.రంగరాజు, మధ్యాహ్న భోజన పథక జిల్లా ప్రధాన కార్యదర్శి కె.స్రవంతి, సిఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ తమ మద్దతును తెలియజేశారు.

మలేరియా నివారణ ప్రతిఒక్కరి బాధ్యత

విశాలాంధ్ర - బొబ్బిలి: దోమల వల్ల వచ్చే ప్రాణాంతక వ్యాధి మలేరియా అని అవగాహనతో జాగ్రత్తలు తీసుకుంటే మలేరియా నివారణ సాధ్యమేనని బొబ్బిలి రోటరీ అధ్యక్షులు, నారాయన ప్పవలస పాఠశాల ప్రధానోపాధ్యాయులు జేసీ రాజు అన్నారు. మంగళవారం నారాయన ప్పవలస, కాసిందొరవలస గ్రామాల్లో ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవ నేపథ్యంలో ర్యాలీ నిర్వహించారు. దోమలు పుట్టకుండా ....పుట్టిన దోమలు కుట్టకుండా చూసుకోవటమే ఈ వ్యాధి నివారణకు ఉత్తమ మార్గం అని అన్నారు. సైన్స్ ఉపాధ్యాయుడు ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ పారిశుధ్యం లోపిం చటమే దోమల పెరుగుదలకు ప్రధాన కారణమని అన్నారు. పరిసరాలను మురుగు నీరు నిల్వ లేకుండా పారిశుధ్యాన్ని మెరుగు పరచుకోవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక ఆరోగ్య కేంద్రం సిహెచ్‌ఓ మాలతి, ఉపాధ్యాయులు మురళి, భానుప్రకాశ్, ఆరోగ్య సిబ్బంది పద్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. మల్లంపేట కొత్త పోలమ్మ దేవత పండగ సందర్భంగా బొబ్బిలి రోటరీ క్లబ్ బొబ్బిలి పురపాలక సంఘం సంయుక్త ఆధ్వర్యంలో మల్లం పేట రామ మందిరం వద్ద చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు క్లబ్ అధ్యక్షులు జెసి రాజు, అసిస్టెంట్ గవర్నర్ తూముల కార్తిక్‌లు తెలిపారు. వీరితో పాటు రోటరీ సర్వీస్ ప్రాజెక్ట్ చైర్మెన్ గెంబలి శ్రీనివాసరావు, సెక్రటరీ శ్రీహరి యువత పాల్గొన్నారు.

జగన్ పాలనలోనే రాష్ట్రం సుభిక్షం

ఎమ్మెల్యే కడుబండి

విశాలాంధ్ర - కొత్తవలస: సంక్షేమ పథకాలతో సీఎం వైయస్ జగన్ పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని శృంగవరపుకోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. కొత్తవలస మండలంలో కొత్తవలస-1 సచివాలయం పరిధిలో ఎస్సీ కాలనీ, రాంజీ నగర్‌లో 184వ రోజు గడపగడపకి మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ప్రతి గడపను సందర్శిస్తూ ప్రజల యోగక్షేమాలు తెలుసుకుంటూ, ప్రభుత్వం నుంచి వారికి అందుతున్న పథకాలను వివరించారు. ముఖ్యమంత్రి ఎల్లప్పుడూ పేద ప్రజల సంక్షేమం కోసం తపన పడుతున్నారని పేర్కొన్నారు. ఇలాంటి ముఖ్యమంత్రిని, వైసిపి ప్రభుత్వాన్ని మళ్లీ మళ్లీ ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు సర్పంచ్ రామస్వామి, పిఎసిఎస్ చైర్మన్ గొల్లపల్లి శివ, గోరపల్లి రవి, మేలాస్త్రి అప్పారావు, వార్డు మెంబర్ కుమారి, ఇతర స్థానిక నాయకులు వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీపీ ఉమాలక్ష్మికి సత్కారం

విశాలాంధ్ర - తెర్లాం: జిల్లాలో ఉత్తమ ఎంపీపీగా అవార్డ్ సాధించిన తెర్లం మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు నర్సుపల్లి ఉమాలక్ష్మిని తహశీల్దార్ డి.రాజేశ్వరరావు దుశ్శాలువతో సత్కరించి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ రవి కిరణ్, మండల సర్వేయర్ వెంకటరమణ, సీనియర్ అసిస్టెంట్ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

SOUTH INDIAN Bank
డోర్ నం.27-14-1, వార్డ్ నం.16, స్నేహ ఆర్కేడ్, దాసన్నపేట, విజయనగరం, ఏపీ-535002, ఇమెయిల్ ఐడి-br0991@sib.co.in

బ్యాంకులో తనఖాపెట్టిన బంగారు ఆభరణాల వేలం

బ్యాంకు నుంచి పొందిన బంగారు రుణాలు చెల్లించవలసిందిగా పిలుపునిస్తూ ఈ కిందపేర్కొన్న రుణగ్రహీతలకు సౌత్ ఇండియన్ బ్యాంక్ లిమిటెడ్ అధీకృత అధికారి విక్రయ నోటీసు(లు) జారీ చేయడమైనది. రుణ మొత్తాలను చెల్లించడంలో రుణగ్రహీతలు విఫలమైనందున తారట్టులో ఉన్న బంగారు ఆభరణాలను "ఉన్నది ఉన్నట్లు ప్రాతిపదిక" & "ఏమి ఉంటే అది ప్రాతిపదిక" & "రికోర్స్ లేని ప్రాతిపదిక" పై దిగువ సంతకందారు ఆన్‌లైన్ వేలం నిర్వహిస్తున్నట్లు ఇందుమూలంగా రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజలకు తెలియజేయడమైనది. కింద పేర్కొన్న విధంగా రుణగ్రహీత ఎకౌంట్ నంబర్ల కొరకు తేదీ :02-05-2023 మ॥12:00 గం.నుండి మ॥03:00 గం.ల వరకు https://egold.auctiontiger.net ద్వారా ఆన్‌లైన్‌లో వేలం నిర్వహించబడును.

వ.సం.	బంగారు రుణ ఖాతా సం.	పేరు	తనాఖా పెట్టిన తేదీ	తనఖాబంగారం బరువు (మొత్తం బరువు గ్రాముల్లో)	బంగారు రుణం మొత్తం
1	099165300001328	కాకాని హిమబిందు	02-09-2022	54.81	1,80,400/-
2	099165300001329	కాకాని హిమబిందు	02-09-2022	6.55	22,900/-
3	099165300002189	పెంటమాని రమేష్	18-08-2022	49.50	1,75,000/-
4	099165300002211	ఆకిరి తనూజ	23-08-2022	49.81	1,42,000/-

మరింత సమాచారం కొరకు దయచేసి ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెక్నాలజీస్ లిమిటెడ్ (ఆక్షన్‌టైగర్)ను 6359575981/9023724780 పై సంప్రదించగలరు.

సం/- మేనేజర్, ది సౌత్ ఇండియన్ బ్యాంక్ లిమిటెడ్.

మతోన్మాద బీజేపీని గద్దె దింపుదాం

విశాలాంధ్ర - కురుపాం: ప్రజావ్యతిరేక విధానాలను అవలం బిస్తున్న మతోన్మాద బీజేపీని సాగనంపి దేశాన్ని కాపాడుకుందామని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వి.కామేశ్వర రావు, జి.ఈశ్వరయ్య, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. మోడీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై వామపక్ష పార్టీలు మంగళవారం నిర్వహించిన ప్రచార బేరి బహిరంగ సభను గుమ్మలక్ష్మిపురం మండల కేంద్రంలో గల బిఎస్ఆర్ కళ్యాణ మండపం వద్ద సీపీఎం నాయకులు కోలక అవినాష్, సీపీఐ నాయకులు తోట జీవన్ అధ్యక్షతన నిర్వహించారు. గిరిజనుల హక్కులైనటువంటి అటవీ సంపద గిరిజనులకే ఉంటుందని పీసా చట్టం ప్రకారం గిరిజన ప్రాంతంలో ఉండే ప్రతి సెంటు భూమి పంచాయతీ తీర్మానం లేకుండా అమ్మడానికి కానీ, కొనడానికి కానీ వీలులేదని అన్నారు. అటువంటిది 1/70 చట్టం జీవో నెంబర్ 3కి తూట్లు పొడుస్తు అడవులను కూడా ఆదానికి ధారాధత్తం చేయడానికి చూస్తే ఊరుకోమన్నారు. మతోన్మాది పార్టీ బీజేపీని తరిమి కొట్టడానికి ప్రజలందరూ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. బీజేపీని, దానికి మద్దతు పలుకుతున్న పార్టీలను ఓడించాలని ప్రజలకు సూచించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పాలనలో పూర్తిగా వైఫల్యం చెందాయని ప్రజలు వచ్చే ఎన్నికల్లో మోడీ జగన్ కు తగిన బుద్ధి చెబుతారన్నారు. జిల్లాలో పశ్చిమ ప్రాంత ఆశాజ్యోతి అయిన సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు పూర్తి చేయడానికి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. ఉపాధి హామీ పథకాన్ని ప్రభుత్వాలు అవినీతిమయం చేశాయని ఆరోపించారు. ఉపాధి హామీ పథకాన్ని పటిష్టంగా అమలు చేసి పేదలకు స్థానికంగా జీవనోపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు కె.సుబ్బారావమ్మ, సీపీఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, సీపీఐ జిల్లా కార్యదర్శి కె.మన్మధరావు, సీపీఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు కొల్లి గంగు నాయుడు, వి.ఇందిరా, వై.మన్మధరావు, కె.ఈశ్వరరావు, ఎం.శ్రీనివాసరావు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జి.సూరయ్య, పి.ప్రసాద్ ఎల్విన్ పేట ఎంపీటీసీ మండంగి రమణ, కుక్కిడి సర్పంచ్ జి.రాజారావు పాల్గొన్నారు.

అర్తం పంచాయతీలో అపారిశుధ్యం

ముడుపుల మత్తులో పంచాయతీ కార్యదర్శి..?

విశాలాంధ్ర - కొమరాడ: ప్రస్తుతం పడుతున్న వర్షాలతో కాలువలో పారిశుధ్యం పేరుకుపోవడంతో అర్తం గ్రామపంచాయతీ కంపు కొడుతుందని ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీలో సక్రమంగా పారిశుధ్య పనులు జరగకపోవడంతో ఎక్కడికక్కడ మురికి నీరు నిలువ ఉండిపోయి దోమలు పెరిగిపోతున్నాయని వాపోతున్నారు. గ్రామాలను అభివృద్ధి బాటలో నడిపించాలని ప్రభుత్వం అధికారులకు పిలుపునిస్తుంటే అధికారులు నిర్లక్ష్యంతో అపారిశుధ్యం రాజ్యమేలుతోందన్నారు. ప్రజలకు సేవలు అందించాల్సిన పంచాయతీ కార్యదర్శి ముడుపులు మత్తులో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఏ చిన్న పనికైనా ముడుపులు చెల్లిస్తే గాని పనులు జరగకపోవడంతో ప్రజలు పంచాయతీ కార్యదర్శిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీసం గ్రామ సచివాలయం కూడా పరిశుభ్రంగా ఉంచడం లేదంటే అధికారుల పనితీరు ఏ విధంగా ఉందో అర్థమవుతుందని ప్రజల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. పంచాయతీలో కొత్త విద్యుత్ కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలంటే పంచాయతీ కార్యదర్శికి రూ.500 వరకు ముడుపులు చెల్లించాలని, విద్యుత్ కనెక్షన్ కోసం ప్రభుత్వానికి రూ.180 మాత్రమే చెల్లించాల్సి ఉన్నప్పటికీ కార్యదర్శికి అదనపు ముడుపు చెల్లించాల్సి వస్తోందని అన్నారు. ఇంటి పన్ను వసూళ్లకు ముందుగా ప్రజలకు డిమాండ్ల నోటీసులు ఇస్తున్నా డబ్బులు కట్టిన వారికి అనంతరం ఎటువంటి రసీదులు చెల్లించకపోవడం చూస్తే ఇంటి పన్ను వసూళ్లలో కూడా అక్రమాలు జరిగాయన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.98 వేలు తూతు మంత్రంగా క్రషర్ బూడిద వేసి నిధులు పక్కదారి పట్టించినట్లు ప్రజల నుంచి తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయంపై స్థానిక ఎంపీడీవో ఎల్వీ అప్పారావుకు కూడా ఫిర్యాదులు చేసినట్లు ప్రజలు తెలిపారు.

మలేరియా లేని జిల్లాగా తయారు చేద్దాం: డీఎంహెచ్ఓ

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: మలేరియా లేని జిల్లాగా పార్వతీపురం మన్యం జిల్లాని సాధిద్దామని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకొని దోమలను అరికట్టి మలేరియా వ్యాధిని నివారించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డా. బి.జగన్నాధరావు, మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు పిలుపునిచ్చారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మంగళవారం మునిసిపల్ కార్యాలయ వద్ద నుండి నిర్వహించిన ర్యాలీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. జిల్లా నూతనంగా ఏర్పడిన తరువాత గత సంవత్సరం విస్తృతంగా నిర్వహించిన మలేరియా నిర్ధారణ పరీక్షల ఫలితంగా మలేరియా కేసులు పూర్తివివరాలు తెలిసాయని అన్నారు. మలేరియా లేని జిల్లాగా చేయుటకు ప్రతి ఒక్కరు సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంటు డా.డి. భాస్కరరావు, జిల్లా ఇమ్యునైజేషను అధికారి టి.జగన్ మోహన్‌రావు, డా. నవీన్ కుమార్, డా. వినోద్ కుమార్, సహాయ మలేరియా అధికారి డి.సూర్యనారాయణ, శానిటరీ ఇనస్పెక్టరు సిహెచ్.మురళి, జి.వి.ఆర్.ఎస్. కిషోర్, వైద్య ఆరోగ్య సిబ్బంది, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

త్రాగునీటి సమస్యలపై కంట్రోల్ రూమ్ ఏర్పాటు

విశాలాంధ్ర - సీతంపేట: మండలంలో 53 పంచాయతీల పరిధిలోని గిరిజన గ్రామాల్లో త్రాగునీటి సమస్యలపై ఆర్‌డబ్ల్యూఎస్ సబ్ డివిజన్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని ఐటీడీఏ పీవో కల్పన కుమారి తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో ఎటువంటి తాగునీటి సమస్యలు ఉన్నా కంట్రోల్ రూం 8639963063కి ఫోన్ చేయవచ్చని త్రాగునీరు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

అమ్మవారి పండగలకు కలెక్టర్‌కు ఆహ్వానం

విశాలాంధ్ర - బెలగాం: మే నెల 28, 29, 30 తేదీలలో నిర్వహించే పార్వతీ పురం గ్రామదేవతలైన ఇప్పల పోలమ్మ, ఎర్ర కంచమ్మ పండగల సందర్భంగా ఆల య కమిటీ సభ్యులు మంగళవారం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలసి ఆహ్వానం పలికారు. జిల్లా ఏర్పడిన తర్వాత ఇదే మొదటి పండుగ కావడంతో అట్టహాసంగా జరుపుతున్నామని ఆలయ కమిటీ సభ్యులు కలెక్టర్‌కు తెలిపారు. ప్రభుత్వం తరఫున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని కలెక్టర్ తెలిపారు.

ఉత్తమ పంచాయతీ సర్పంచ్, సెక్రటరీలకు అభినందనలు

విశాలాంధ్ర - సీతానగరం: మండల స్థాయిలో ఉత్తమ గ్రామ పంచాయతీ ఎంపికైన చినబోగిల గ్రామ పంచాయతీకి ఉత్తమ అవార్డు సోమవారం మండల ప్రజా ప్రతినిధులు, అధికారులు అందజేయడం పట్ల చినభోగిలి గ్రామ పెద్దలు, సచివాలయం సిబ్బంది, వార్డు సభ్యులు, వాలంటీర్లు వైసీపీ అభిమానులు, సర్పంచ్ కురమాన రాధ శ్రీనివాసరావుకు అభినందనలు తెలిపారు. సర్పంచ్‌తో పాటు కార్యదర్శికి అభినందనలు తెలిపారు.

అంగవైకల్య విద్యార్థికి అండగా ఎమ్మెల్యే జోగారావు

విశాలాంధ్ర - బెలగాం : స్థానిక మునిసిపాలిటీ 21వ వార్డు వివేక్ కాలనీలో జగనన్నే మా భవిష్యత్తు ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు తాను వెళ్లిన ఒక ఇంటి వద్ద వీల్ చైర్ పైన కూర్చొని ఉన్న దివ్యాంగ విద్యార్థినిని ఆప్యాయంగా పలకరించారు. విద్యార్థి సమస్యను తెలుసుకుని ప్రభుత్వం నుంచి దీర్ఘకాలిక పింఛను మంజూరు చేయించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని వారి కుటుంబానికి హామీ ఇచ్చారు. ఈ వారంలోనే వైద్య పరీక్షలు చేయించి పింఛను మంజూరుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలక్రిష్ణ, మునిసిపల్ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

రైతు యంత్ర సేవా కేంద్రాలు పూర్తి స్థాయిలో పనిచేయాలి

విశాలాంధ్ర - పార్వతీపురం: వై.ఎస్.ఆర్ రైతు యంత్ర సేవా కేంద్రాలు పూర్తి స్థాయిలో పని చేయాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. ఈనెల 28 నాటికి కొనుగోలు ఆర్డర్లు పెట్టాలని స్పష్టం చేశారు. ప్రాథమికరంగ శాఖల అధికారులతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్‌ను జిల్లా కలెక్టర్ నిర్వహించి మాట్లాడారు. కిసాన్ డ్రోన్ పైలట్‌లను గుర్తించాలని అన్నారు. జిల్లా నుండి 45మందికి శిక్షణ ఇచ్చే అవకాశం ఉందని, ఇప్పటివరకు 13 మందిని గుర్తించడం జరిగిందని చెప్పారు. చిరు ధాన్యాల పంట విస్తరణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన అన్నారు. రైతు భరోసాలో ఆర్.ఓ.ఎఫ్.ఆర్ భూములకు సంబంధించిన రైతులు వివరాలు పూర్తిగా నమోదు చేయుటకు చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఉద్యాన శాఖ అధికారులు చేస్తున్న కార్యకలాపాలను వీడియో రూపంలో నివేదిక సమర్పించాలని ఆయన అన్నారు. పశువులకు డీ వార్మింగ్ చేయాలని ఆయన స్పష్టం చేశారు. సంతలలో పశువుల క్రయ విక్రయాలను పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు సందర్శించాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్ పాల్, జిల్లా పశుసంవర్ధక అధికారి ఈశ్వరరావు, జిల్లా ఉద్యాన శాఖఅధికారి రెడ్డి, జిల్లా మత్స్య శాఖ అధికారి వేమూరి తిరుపతయ్య, ఏపిఎంఐపి ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తాలాడ సచివాలయ పరిధిలో గడప-గడపకూ

విశాలాంధ్ర - సీతంపేట: సీతంపేట మండలం తాలాడ సచివాలయం పరిధిలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. లబ్ధిదారుల చెంతకు నేరుగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నట్లు ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి తెలిపారు. సీతంపేట మండలం తాలాడ సచివాలయం పరిధిలో మూర్తకారిగూడ, బెన్నడుగూడ, ఉయ్యలగూడ, ఎగువసేరా, దిగువ సేరా, సింగన్నగూడ గ్రామాలలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గడపగడపకు వెళ్లి సంక్షేమ పథకాలపై ఆమె ఆరా తీశారు. వారి సమస్యలను తెలుసుకుంటూ వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హత ఉండి సాంకేతిక, ఇతర కారణాల రీత్యా ఏమైనా ప్రభుత సంక్షేమ పథకాలు అందకుంటే, మళ్లీ వినతులు అందిస్తే పరిశీలిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సస్పెన్షన్ పట్ల విచారణ

విశాలాంధ్ర - పార్వతీపురం : జిల్లాలోని విద్యాశాఖలో జరిగిన సస్పెన్షన్లపట్ల జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ విచారణ జరిపారు. జిల్లాకలెక్టర్ కార్యాలయంలో మంగళవారం సంబంధిత అధికా రులను విచారించారు. విచారణలో పాలకొండ ఉప విద్యాశాఖాధికారి ఆర్. విజయ కుమారి, సహాయ గర్ల్ చైల్డ్ డెవలప్మెంట్ అధికారి కె.రోజారమణి, వీరఘట్టం మండలం రేగులపాడు కెజిబివి ఇంచార్జి ప్రిన్సిపాల్ చెన్న రోహిణి, వీరఘట్టం మండల విద్యాశాఖాధికారి పి. కృష్ణ మూర్తి, శ్రీకాకుళం ప్రభుత్వ పాఠ్య పుస్తకాల డిపో మేనేజర్ ఎస్.సతీష్ పాల్గొన్నారు.

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే జోగారావు

విశాలాంధ్ర - బెలగాం : పార్వతీపురం నియోజకవర్గం పరిధిలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు సారథ్యంలో 207వ రోజున 63వ సచివాలయం పరిధిలో గల పార్వతీపురం మండలం వెంకంపేట గ్రామంలో మంగళవారం వరుసగా 5వ రోజున గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే జోగారావు సచివాలయం, మండల అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలసి మెయిన్ రోడ్డు కాలనీలలో గల గడప గడపకు వెళ్లి సిఎం వైయస్ జగన్మోహన్ రెడ్డి 45 నెలల సంక్షేమ పాలనలో ప్రజలకు ప్రభుత్వం చేసిన సంక్షేమ సహాయాన్ని తెలియపరిచి, వారికి ఉన్న అర్హత ప్రకారం సంక్షేమ పథకాలు అందుతున్నవా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తీళ్ల కృష్ణారావు, మండల ప్రజా ప్రతినిధులు వైస్ ఎంపిపి సిద్ధ జగన్నాధరావు, మండల పార్టీ అధ్యక్షులు బొమ్మి రమేష్, ఎక్స్ సర్పంచ్ తీళ్ల సుభద్రమ్మ, పిఎసిఎస్ చైర్మన్ శివున్నాయుడు, మండల వైసీపీ సీనియర్ నాయకులు కె. సత్యానారాయణ, బి.కృష్ణమూర్తి, వి.గురురాజు, తీళ్ల చంటి, వివిధ గ్రామాల సర్పంచ్లు సవరాపు రాజారావు, మడక విశ్వనాధం, ఎస్. శ్రీరాములు నాయుడు, జెసిఎస్ కన్వీనర్ బి.వాసుదేవరావు, ఎంపిటిసి సభ్యులు బి. రవికుమార్, బి. రామారావు, కార్యకర్తలు, సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు, మండల అధికారులు, సచివాలయం ఉద్యోగులు, వాలంటీర్లు, కన్వీనర్లు, గృహ సారథులు, స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉపాధి పనులను ఎంపీడీఓ పరిశీలన

విశాలాంధ్ర - తెర్లాం: మండలంలో మంగళవారం ఎం. ఆర్.అగ్రహారం పనుకు చెరువులో జరుగు తున్న పంచాయతీలో నిర్వహిస్తున్న ఉపాధి పనులను మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎస్.రామకృష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా మస్టర్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఉపాధి కూలీలు మంచినీరు, మజ్జిగను వెంట తెచ్చుకోవాలని సూచించారు.

సర్వే రాళ్లు ఏర్పాటు

విశాలాంధ్ర - తెర్లాం: మండలంలో మంగళవారం జగనన్న శాశ్వత భూహక్కు భూ రక్షా పథకంలో భాగంగా తహశీల్దార్ డి.రాజేశ్వర్రావు ఆధ్వర్యంలో తెర్లాం మండలంలోని పుల్లేరువలస రెవెన్యూ గ్రామంలో సదరు గ్రామ సర్పంచ్ అయిన జావాన రమేష్ నాయుడు జగనన్న భూ సర్వే రాళ్లను వివిధ పొలాల హద్దుల్లో పాటించడం జరిగింది. ఈ కార్య క్రమంలో గ్రామ రెవిన్యూ అధికారులు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

వెంకన్నపేటలో ఎన్ఎస్ఎస్ శిబిరం

విశాలాంధ్ర - డెంకాడ: ఎం.వీ.జీ.ఆర్ ఎన్.ఎస్.ఎస్ యూనిట్ వెంకన్నపేట గ్రామంలో 7 రోజుల ఎన్.ఎస్.ఎస్ ప్రత్యేక శిబిరాన్ని నిర్వహిస్తోంది. మంగళవారం మిల్లెట్ ఫుడ్స్ దాని సాగు, ఫిట్నెస్, ఆరోగ్యం యోగా, ఆధునిక వ్యవసాయ పద్ధతులు, నీటి ద్వారా సంక్రమించే వ్యాధుల వ్యాప్తి తదితరా లపై అవగాహన కల్పిస్తున్నారు. ఎం.వీ.జీ.ఆర్ ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లందరూ గ్రామంలోని వీధుల్లో స్వచ్ఛభారత్ నిర్వహించి, వీధుల్లో చెత్తను సేకరించి, డ్రైనేజీ ప్రాంతాల్లో దోమల వృద్ధిని, నీటి ద్వారా వ్యాపించే వ్యాధులను అరికట్టడానికి బ్లీచింగ్ పౌడర్ను చల్లారు. డీన్ ఎస్.మోహన్ కుమార్, షణ్ముఖరావు, ఎన్.ఎస్.ఎస్ పీ.ఓ శ్రీనివాసరావు, వెంకన్నపేట ప్రభుత్వ ప్రధానోపాధ్యాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు వైసీపీ నేతలతో ఎమ్మెల్యే సమావేశం

విశాలాంధ్ర - సీతానగరం: జగనన్నే మా నమ్మకం, జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా కోటి కుటుంబాలకు చేరువైన సందర్భంగా ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో బుధవారం మండల వైసీపీ కార్యాలయంలో సమావేశం నిర్వహిస్తున్నట్టు మండల వైసీపీ అధ్యక్షుడు బొంగు చిట్టిరాజు తెలిపారు. ఈ సమావేశానికి మండల ప్రజా ప్రతినిధులు, మండల నాయకులు, సర్పంచులు, కన్వీనర్లు, ఎంపీటీసీలు తప్పకుండా హాజరు కావాలని కోరారు. అలాగే జగనన్నే మాభవిష్యత్తు కార్యక్రమం పూర్తయిన కన్వీనర్లు పీపుల్స్ సర్వే రిసీట్ పుస్తకాలు పట్టుకుని మీటింగుకు రావాలని కోరారు.

రిజర్వేషన్లపై బీజేపీ దాడి అమానుషం

విశాలాంధ్ర - వేపాడ: రిజర్వేషన్లపై కేంద్ర ప్రభుత్వం జరుపుతున్న దాడులు అమానుషమని సీపీఎం జిల్లా నాయకులు చల్లా జగన్ అన్నారు. అలాగే కేంద్ర మంత్రి అమిత్ షా బహిరంగ సభల్లో ముస్లింల రిజర్వేషన్ తీసేస్తాం అని చెప్పడమంటే దేశంలో ఉన్న మైనార్టీలు, పేద బడుగు ప్రజలపై దాడి చేయడమేనని అన్నారు. రాజ్యాంగాన్ని నిట్ట నిలువునా తూట్లు పొడుస్తూ, మతాల మధ్య, కులాల మధ్య చిచ్చు పెట్టడం దారుణమన్నారు. దేశం నుండి బిజెపిని సాగనంపి, రాజ్యాంగాన్ని దేశాన్ని కాపాడుకుందామని పిలుపునిచ్చారు.

అత్త ఆత్మహత్యాయత్నం

విశాలాంధ్ర - బెలగాం: కోడలు తనను ఆడిపోసు కుంటోందని మనస్తాపంతో అత్త ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పార్వతీపురం జిల్లా ఆసుపత్రి ఔట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జియ్యమ్మవలస మండలం చినకుదమ గ్రామానికి చెందిన కోరాడ గౌరమ్మ కూలి పని చేసుకుంటోంది. మంగళవారం ఉదయం తన యింటి వద్ద తన పెద్ద కుమారుడు రవి, అతని భార్య ఇద్దరూ ఉన్నారు. బయట తమ్ముడు వరుస అయిన గౌరమ్మను ఏదో అన్నాడు. రెండు రోజుల క్రితం గౌరమ్మ కుమారుడి వద్దకు వైజాగ్ వెళ్ళగా అక్కడ కోడలు ఆమెను ఏవో అనరాని మాటలు అనడంతో మనస్తాపం చెందింది. ఇంటిలో ఉన్న చీమల మందును త్రాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన స్థానికులు చూచి 108 వాహనంలో పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తీసుకొని రాగా వైద్యులు చికిత్స అందించారు. ఔట్ పోస్టు పోలీసులు వివరాలను నమోదు చేసినట్లు తెలిపారు.

మండల సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర - దత్తి రాజేరు: మండల పరిషత్ కార్యా లయంలో మంగళవారం ఎంపీడీవో సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు అధ్యక్షతన అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలలో 1998 డీఎస్సీ అభ్యర్థులకు, 10 మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చి చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి, వైస్ ఎంపీపీలు బమ్మిడి అప్పలనాయుడు, మిత్తిరెడ్డి రమేష్, బీసీ సెల్ అధ్యక్షులు మంత్రి అప్పలనాయుడు, ఏఎంసీ వైస్ చైర్మన్ మండల శ్రీనివాసరావు, పిఎసిఎస్ అధ్యక్షులు సుమల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎంపీడీఓ తీరుపై ఎంపీటీసీ అసహనం

విశాలాంధ్ర - దత్తిరాజేరు: మండల పరిషత్ కార్యాలయం ఎదుట మంగళవారం గోభ్యాం గ్రామానికి చెందిన ఎంపీటీసీ వంగపండు కృష్ణమూర్తి నాయుడు అధికారులు తీరుపై అసహనాన్ని వ్యక్తం చేశారు. నాలుగేళ్ల క్రితం 56 వేల రూపాయలు ఖర్చుతో గ్రామంలో శానిటేషన్ పనులు చేసినప్పటికీ నేటికీ బిల్లు అవ్వలేదని ఎంపీడీఓకి ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేదన్నారు. అలాగే తమ గ్రామానికి చెందిన వంగపండు నారాయణరావుని బ్రతికుండగానే చనిపోయినట్లు నమోదు చేశారని అన్నారు.

లక్ష్యం మేరకు బియ్యాన్ని సరఫరా చేయాలి

విశాలాంధ్ర - పార్వతీపురం: మిల్లర్లు ఎఫ్సిఐ, సిఎస్సికి అందించవలసిన బియ్యంను సకాలంలో అందించాలని జిల్లా కలెక్టరు నిశాంత్ కుమార్ తెలిపారు. మంగళవారం కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో సివిల్ సప్లయి అధికారులు, మిల్లర్లతో నిర్వహించిన సమావేశంలో బియ్యం రవాణాపై సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ లక్ష్యంమేరకు సకాలంలో బియ్యం రవాణా పూర్తిచేయాలని తెలిపారు. బియ్యం రవాణాకు కావలసిన వాహనాలు అందిం చాలని, లోడింగు, అన్ లోడింగుకు హమాలీలను సమకూర్చుకోవాలని అధికారులకు తెలిపారు. అంటిపేట, సింగన్నపాలెం, బలిజపేట, బూర్జవద్దగల గొడౌన్లకు బియ్యం సప్లయి చేయుటకుగాను రోజువారీ లక్ష్యాలను నిర్దేశించుకొని సరఫరా పూర్తిచేయాలని తెలిపారు. సమావేశంలి పౌర సరఫరాల సంస్థ జిల్లామేనేజరు ఎం.డి. నాయక్, జిల్లా పౌర సరఫరాల అధికారి కె.వి.ఎల్.ఎన్.మూర్తి, ఎఫ్.సి.ఐ. రీజనల్ మేనేజరు ప్రపుల్ల కుమార్, క్వాలిటీ కంట్రోల్ మేనేజరు ప్రశాంత్ బెహ్రా, మిల్లర్ల అసోసియేషన్ ప్రెసిడెంట్ రమేష్, మిల్లర్ల యజమానులు పాల్గొన్నారు.

నాగోజీపేట వాసులకు ఇళ్ల పట్టాలు పంపిణీ

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: 60 ఏళ్ల నాటి కల సాకారమయింది. ఇంటికి పట్టాను పొందే సమయంలో నాగోజీవాసులు ఆనంద భాష్పాలు విడిచారు. మంగళవారం 25వ డివిజన్ నాగోజీపేటలో 47 మంది స్థానికులకు ఇళ్లపట్టాలను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అందించారు. ఎన్నో సంవత్సరాలుగా ఇక్కడ నివాసముంటున్న ఇళ్లకు పట్టాలు లేకపోవడంతో భయం భయంతో కాలాన్ని వెల్లదీసేవారు ఇక్కడి ప్రజలు. ఎన్నికల సమయంలో హామీలు గుప్పించడమే తప్ప ఆచరణ సాధ్యం కాకుండా విడిచిన నేతలు ఎంతోమంది ఉన్నారు. గత ఎన్నికల సమయంలో కోలగట్ల ఇచ్చిన హామీ మేరకు ఇళ్ల పట్టాలను వారికి అందించడంతో సంబరాలు చేసుకున్నారు. పట్టాల పంపిణీ కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అన్ని వర్గాలను అభ్యున్నతి వైపు తీసుకెళ్లే కార్యక్రమాల అనేకం చేస్తున్నారన్నారు. గత పాలకులు పట్టాలందిస్తామని మాటలు చెప్పి ఓట్లు వేయించుకొని తీరా గెలుపొందాక నాగోజీపేట వాసులను పట్టించుకునే వారు కాదని అన్నారు. తాము అధికారం చేపట్టాక ఈ ప్రాంతంలో అన్ని సౌకర్యాలను కల్పించమన్నారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, వైసీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, తహసిల్దార్ బంగారు రాజు, డిప్యూటీ మేయర్ రేవతి దేవి, జోనల్ ఇన్చార్జి బోడసింగి ఈశ్వరరావు, స్థానిక వైసిపి నాయకులు యడ్ల రాజేష్, కార్పొరేటర్ జివి రంగారావు, యాదవ హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఇసరపు శేఖర్ యాదవ్, డివిజన్ అధ్యక్షుడు గొట్టముక్కల మురళి తదితరులు పాల్గొన్నారు.

దుర్గాలమ్మను దర్శించుకున్న కోళ్ల దంపతులు

విశాలాంధ్ర - వేపాడ: మండలంలోని దబ్బిరాజుపేట గ్రామదేవత శ్రీ దుర్గాలమ్మ తల్లిని ఎస్.కోట మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల రాంప్రసాద్ దంపతులు మంగళవారం దర్శించుకున్నారు. అమ్మవారి పండగ మహోత్సవంను పురస్కరించుకొని శ్రీ దుర్గాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు. స్థానిక టీడీపీ నాయకులు కోన సత్యం, జొన్నవల్లి వెంకటరమణ, ఏడువాక రామకృష్ణ తదితరుల ఆహ్వానం మేరకు గ్రామ పొలిమేర నుండి ఆలయం వరకు పాదయాత్రగా తరలివెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు. కొట్యాడ రమణమూర్తి, పోతల వెంకటరమణ, మాజీ ఎంపీపీ దాసరి లక్ష్మి,ఎల్ కోట మాజీ జెడ్పీటీసీ కరెడ్ల ఈశ్వరరావు, నిరుజోగి ఈశ్వరమ్మ, గుంటువల్లి దేముడునాయుడు, గోకేడ మద్దాలనాయుడు, బోజంకి మహేష్, గుమ్మడి గణేష్, చల్లా వెంకటరావు, నిరుజోగి అమ్మతల్లి నాయుడు, బూసరి కృష్ణకుమార్, నాగిరెడ్డి ముత్యాలనాయుడు, గొర్రుపోటు ప్రసాద్, నిరుజోగి బంగారునాయుడు, కొప్పల అప్పారావు, గొర్రుపోటు రాము, గోలగాని కృష్ణ, జామి అప్పలనాయుడు, రంధి మహేష్, గోకేడ సత్యం, గోకేడ నాగభూషణం,కోలా అప్పలసత్యం తదితరులు ఉన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ స్పందనపై ధన్యవాదాలు

విశాలాంధ్ర - సీతానగరం: మన్యం జిల్లా విద్యాశాఖాధికారి డాక్టరు ఎన్డివి రమణ మరో ఆరుగురు ఉద్యోగుల సస్పెన్షన్ల వ్యవహారంపై రాష్ట్ర ముఖ్యమంత్రి స్పందించి మన్యం జిల్లా కలెక్టరుకు సమస్య పరిష్కారం చేయాలని కోరుతూ అదేశాలు జారీ చేయడం పట్ల రాష్ట్ర ఏపీటీఎఫ్ మహిళా కౌన్సిలర్, ఫ్యాప్టో సభ్యురాలు, కోట సీతారాంపురం ప్రాథమికోన్నత పాఠశాల ప్రదానోపాధ్యాయరాలు చుక్క శ్రీదేవి ధన్య వాదాలు తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. విద్యాశాఖలో జిల్లా విద్యా శాఖాధికారి డాక్టరు రమణ లాంటి అధికారులు అరుదని, అటువంటి వ్యక్తి సస్పెన్షన్ మన్యం జిల్లా ఉపాధ్యాయ లోకం జీర్ణించుకోలేక అన్ని సంఘాల ఆధ్వర్యంలో నిరసనలు వెల్లువెత్తాయన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వ హించిన ర్యాలీకి అన్ని సంఘాలకు చెందిన ఉపాధ్యాయ సిబ్బంది పెద్దఎత్తున తరలిరావడంతో ప్రభుత్వం జిల్లా కలెక్టరుతో చర్చలు జరిపి న్యాయబద్ధంగా పరిష్కారం చేయాలని ఆదేశించడం శుభపరిణామమన్నారు. సత్వరమే డీఈఓ, ఇతర ఉద్యోగుల సస్పెన్షన్ ఉత్తర్వులు ఎత్తివేసి న్యాయం చేయాలని ఆమె కోరారు. సస్పెన్షన్ ఉత్తర్వులపై రాష్ట్ర ముఖ్యమంత్రి స్పందించడంపై పీఆర్టీయూ, ఏపీటీఎఫ్ మన్యం జిల్లా అధ్యక్షులు వోలేటి తవిటినాయుడు, మరదాన శివున్నాయుడు, రాష్ట్ర ఏపీటీఎఫ్ రాష్ట్రనేత దాసరి వెంకట నాయుడులు తెలిపారు. వారితో పాటు మండల పీఆర్టీయూ అధ్యక్ష, కార్యదర్శులు మరిశర్ల జగదీష్, అలజింగి నాగ భూషణరావు, ఏపీటీఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు తట్టికోట గౌరునాయుడు, పోల సత్యనారాయణ, యుటిఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు ఒమ్మి రామకృష్ణ, పల్లి శ్రీనివాసరావులు కూడా స్వాగతము పలికారు.

సమీక్షలు పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు

లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి

విశాలాంధ్ర - విజయనగరం క్రైమ్: జగన్మోహన్ రెడ్డికి రాష్ట్ర ప్రజలు ముఖ్యమంత్రి పదవి కట్టబెట్టి నాలుగేళ్లు పూర్తయినా ఉత్తరాంధ్రలో కనీసం ఒక్క సాగునీటి ప్రాజె క్టుకైనా పూర్తి స్థాయిలో నిధుల కేటాయింపులు చెయ్య కుండా కాలక్షేపం చేస్తున్నారని, తూ.. తూ మంత్రంగా సమీక్షలు జరిపి ప్రజలని తప్పుదోవ పట్టిస్తున్నారని లోక్ సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి ఆరోపించారు. మంగళవారం ఆ పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు జిల్లాలోని పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులపై సోమవారం చేసిన సమీక్ష సమావేశం ఎటువంటి ప్రయోజనం లేకుండా ముగిసిందని ఎద్దేవా చేశారు. నిధులు విడుదల చెయ్యకపోతే తాము ఏమి చెయ్యగలమని అధికారులు పెదవి విరుస్తున్నారని, నీళ్లు, నిధులు, నియామకాలు విషయంలో ఉత్తరాంధ్ర చాలా నష్టపోయిందని, ముఖ్యమంత్రి పై వత్తిడి చేసి సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చెయ్యాలనే ధ్యాసే ఉత్తరాంధ్రలోని మంత్రులు, ఎమ్మెల్యేలకి లేదని భీశెట్టి విమర్శించారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పనులు కోసం మంత్రులు మాట్లాడటం లేదని, మంత్రులు ఎమ్మెల్యేలు పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ముఖ్యమంత్రితో మాట్లాడి తగిన చర్యలు తీసుకోవాలని భీశెట్టి కోరారు.

వైభవంగా శ్రీ దారగంగమ్మ అమ్మవారి పండగ



విశాలాంధ్ర - శృంగవరపుకోట: శృంగవరపుకోట గ్రామ ప్రజల ఇలవేల్పు, గ్రామదేవత శ్రీదారగంగమ్మ అమ్మవారి చిన్న పండుగను అంగరంగ వైభవంగా మంగళవారం నిర్వహించారు. ఉదయం నుండి వందలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని పసుపు, కుంకుమ వంటివి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు అగ్నిహోత్రం రాజగోపాలాచార్యులు ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి ప్రజలు, భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు రాజగోపాలాచార్యులు మాట్లాడుతూ ఇది అమ్మవారి చిన్న పండుగ అని, వచ్చే ఏడాది పెద్ద పండుగ నిర్వహణ ఉంటుందన్నారు. అమ్మవారి అనువంశిక పూజారి మోపాడ గౌరినాయుడు, ఎస్.కోట ఉప సర్పంచ్, వైఎస్సార్సీపీ మండల పార్టీ అధ్యక్షుడు మోపాడ కుమార్, వారి కుటుంబ సభ్యులు, వందలాది మంది భక్తులు డప్పు వాయిద్యాలు, బాణాసంచా కాల్పుల నడుమ శ్రీదారగంగమ్మతల్లి ఆలయానికి చేరుకుని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఈవో నాగేంద్ర, ఆలయ కమిటీ చైర్మన్ పొలమరశెట్టి రామకృష్ణ, సభ్యులు గార్లపాటి సత్యసాయి, కడారి జయశంకర్, నాగరాజు, సిబ్బంది భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు లేకుండా పర్యవేక్షించారు.

ఘనంగా శ్రీ ఆంజనేయస్వామి తీర్థం

విశాలాంధ్ర - శృంగవరపుకోట: ఎస్.కోట మండలం వీరనారాయణం గ్రామంలో శ్రీ ఆంజనేయస్వామి తీర్థ మహోత్సవం సందర్భంగా ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, వైస్ ఎంపీపీ సుధారాజు దంపతులు స్వామివారిని మంగళవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జరిగిన భారీ అన్నసమారాధనలో ఎమ్మెల్సీ దంపతులు పాల్గొని భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. ఈ కార్యక్రమంలో ఎస్.కోట ఎం.పి.పి సండి సోమేశ్వరరావు, జెడ్పీటీసీ మమ్ములూరి వెంకటలక్ష్మి, సర్పంచ్ ఎం.సరోజిని, ఎం.పి.టి.సి బి.వెంకటలక్ష్మి, వైస్ సర్పంచ్ పురుషోత్తమనాయుడు, మాజీ ఎం.పి.టి.సి, వార్డు మెంబర్ బోజంకి గోవింద, గ్రామపెద్ద మమ్ములూరి సోంబాబు తదితరులు పాల్గొన్నారు.

నలుగురికీ సేవ చేయడం గొప్ప అదృష్టం

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: మనసుకు సంతోషం కలగాలంటే నచ్చిన పని చేయాలని, ఇతరులకు సేవ చేస్తూ వారి కళ్ళల్లో ఆనందమే తమ ఆనందంగా భావిస్తారని నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. మాతృదేవోభవ ట్రస్ట్ 11వ వార్షికోత్సవం సందర్భంగా నిరుపేదలకు, పేద విద్యార్థులకు రూ. 1.36 లక్షల విలువైన నిత్యావసరాల సరుకులు, ఆర్థిక సాయం పంపిణీ కార్యక్రమాన్ని ఆనంద గజపతి ఆడిటోరియంలో నిర్వహించారు. మనం సంపాదించిన దాంట్లో కొంత మొత్తాన్ని నలుగురికీ ఉపయోగపడేలా చూస్తే తిరిగి ఏదో విధంగా ఆ ఫలం మనకు దక్కుతుందని చెప్పారు. సుమారు రూ.లక్షన్నర సొంత నిధులు వినియోగించి పేదల కనీస అవసరాలు తీర్చిన మాతృదేవోభవ ట్రస్టు సేవలు ప్రశంసనీయమని తెలిపారు. అనంతరం ముఖ్య అతిథుల చేతుల మీదుగా పేదలకు నిత్యావసరాలు, దుప్పట్ల పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్టు వ్యవస్థాపకులు డోల చిరంజీవిరావు, ఈపీడీసీఎల్ అధికారి లక్ష్మణరావు, సురేష్, బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

గడప-గడపకూ కోలగట్ల

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సరదా సరదాగా మంగళవారం సాగింది. స్థానిక సమస్యలను తెలిపిన వెంటనే పరిష్కరిస్తూ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి వడివడి అడుగుల పర్యటనలు, ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల అమలు తీరుపై అభిప్రాయాలు, కాలువలు, వీధి దీపాలు, రహదారులు వంటివి ఏర్పాటుకు అక్కడికక్కడే పరిష్కారం మార్గాలు, నేటి గడవగడపలో ప్రత్యేకతలు. మంగళవారం ఉదయం 44వ డివిజన్ అయ్యన్నపేట, చెంచుల కాలనీ తదితర ప్రాంతాల్లో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి పాల్గొన్నారు. ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరును వివరిస్తూనే ప్రభుత్వంపై ప్రజలకున్న విశ్వాసాన్ని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ రేవతి దేవి, సహాయ కమిషనర్ ప్రసాదరావు, జోనల్ ఇన్చార్జి దూబే, వైసీపీ నాయకులు సైలాడ సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షుడు లంక మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అన్నార్తుల ఆకలి తీర్చడం అభినందనీయం

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: ఆకలితో ఉన్న పేదలను ఆదుకోవడం మాధవ సేవతో సమానమని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏజీఎం జే. శ్రీనివాసరావు అన్నారు. ఎన్సీయస్ ఎదురుగా ఉన్న ఫుడ్ బ్యాంక్ వద్దకు చేరుకుని పేదలకు ఆహారాన్ని వడ్డించారు. ఫుడ్ బ్యాంక్ నిర్వహిస్తున్న శ్రీ గౌరీ సేవా సంఘం ప్రతినిధులను అభినందించారు. గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో 537వ రోజులుగా పేదలకు అన్నదానాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఏజీఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ నగరంలో పేదలకు ఉచితంగా ఆహారాన్ని అందించాలన్న ఆలోచన చేయడమే కాకుండా ఆచరణ సాధ్యం చేసి చూపిస్తున్న కోలగట్ల వీరభద్ర స్వామికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఐదు ఫుడ్ బ్యాంకులు ద్వారా రోజుకు 800 మంది వరకు పేదలకు ఆహారాన్ని అందించడం గొప్ప విషయం అన్నారు. కార్యక్రమంలో గౌరీ సేవా సంఘం ప్రధాన కార్యదర్శి కనిశెట్టి సుధాకర్, సంఘం అధ్యక్షులు కాండ్రేగుల శేఖర్, గవర కార్పొరేషన్ డైరెక్టర్ ఆడారి రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల సామాజిక తనిఖీపై అవగాహన

విశాలాంధ్ర - తెర్లాం: మండలంలో మంగళవారం ఎంఈఓ జే.త్రినాధరావు హైస్కూల్ హెచ్ఎంలకు, యుపి స్కూల్స్, ప్రైమరి స్కూల్స్ సీఆర్పీలకు స్కూల్ సోషల్ ఆడిట్‌పై సమావేశం నిర్వహించారు. "పాఠశాల సామాజిక తనిఖీ" గూర్చి ఏవిధంగా నిర్వహించాలి అనే అంశాలపై అవగాహన కల్పించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి మీసాల ప్రసాద్‌రావు రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించారు. ఈ సామాజిక తనిఖీ ద్వారా పాఠశాలల మౌలిక సదుపాయాలు, విద్యార్థులకు, ఉపాధ్యాయులకు చెందిన సమగ్రమైన అన్ని అంశాలు పరిశీలించి నివేదించడం జరుగుతుందని తెలిపారు.

సస్పెన్షన్‌లపై సీఎం స్పందనపై హర్షం

విశాలాంధ్ర - పార్వతీపురం: మన్యం జిల్లా విద్యాశాఖా ధికారి డాక్టరు ఎన్ డి వి రమణ మరో ఆరుగురు ఉద్యోగుల సస్పెన్షన్ల వ్యవహారంపై రాష్ట్రముఖ్యమంత్రి నేరుగా సోమవారం స్పందించి తక్షణమే మన్యం జిల్లా కలెక్టరు నిషాంత్ కుమార్‌ను ఉద్యోగ, ఎన్జిఓ సంఘాలనేతలను పిలిచి సమావేశం నిర్వహించి సమస్య పరిష్కారం చేయాలని కోరడం హర్షనీయమని పార్వతీపురం మన్యం జిల్లా ఎన్జీఓ సంఘం అధ్యక్షులు జి వి ఎస్ కిషోర్ తెలిపారు. మంగళవారం ఆయన జేఏసి తరుపున జిల్లా కలెక్టరు కార్యాలయం వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. విద్యాశాఖలో జిల్లా విద్యా శాఖాధికారి డాక్టరు రమణ, తదితర ఉద్యోగుల సస్పెన్షన్ పై సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ర్యాలీకి ఉపాధ్యాయసిబ్బంది పెద్దఎత్తున తరలిరావడంతో పాటు ఎన్ జి ఓ యూనియన్ మద్దతు పలకడాన్ని గమనించిన ప్రభుత్వం జిల్లా కలెక్టరును చర్చలు జరిపి న్యాయబద్ధంగా పరిష్కారం చేయాలని కొద్ది సమయంలోనే ఆదేశించడం శుభపరిణామమన్నారు.

ఎస్సీ కమిషన్ చైర్మన్‌ను కలిసిన జయమణి

విశాలాంధ్ర - పార్వతీపురం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ ఎం.విక్టరీ ప్రసాద్‌ను మంగళవారం మర్యాదపూర్వకంగా రాష్ట్ర కార్యాలయంలో కలవడం జరిగిందని రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్, పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే సవరపు జయమణి తెలిపారు. తనకు అప్పజెప్పిన బాధ్యతలు నిర్వహించే తీరును ఆయనకు వివరించామని తెలిపారు. అనంతరం తాడేపల్లి ఫార్ఛ్యూన్ గ్రాండ్ హోటల్ నందు ఎస్సీ నాయకుల సభకు హాజరై ప్రభుత్వ సలహాదారు సజ్జల రామక్రిష్ణరెడ్డిని, మంత్రులు మేరుగ నాగార్జున, ఆదిమూలపు సురేష్, రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షులు, బాపట్ల ఎంపీ నందిగాం సురేష్, ఎస్సీ కులాలకు చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలను కలవడం జరిగిందని ఆమె తెలిపారు. అనంతరం రాష్ట్ర టిడ్కో ఛైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్‌ను అతని కార్యాలయంలో కలవడం జరిగిందన్నారు. ఆమెతో పాటు సవరపు రామారావు పాల్గొన్నారు.

గ్యాస్ లీకేజీతో అగ్నిప్రమాదం

రూ.లక్షా 50వేలు ఆస్తినష్టం

విశాలాంధ్ర - శృంగవరపుకోట: ఎస్.కోట పట్టణ శివారు సీతంపేటలో శానాపతి సన్నిబాబు అనే వ్యక్తి ఇంట్లో గ్యాస్ లీకేజీ కారణంగా మంగళవారం అగ్నిప్రమాదం సంభవించింది. అగ్నిమాపక అధికారి షేక్ మదీనా, స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. గ్యాస్ లీకయి ఒక్కసారిగా మంటలు చెలరేగటంతో ఇంట్లో ఉన్న ఫ్రిడ్జ్, టీవీ, నిత్యావసర వస్తువులు, బట్టలు, విద్యుత్ మీటర్, గ్యాస్ స్టవ్, సిలిండర్ వంటివి కాలిపోవటంతో రూ. 1,50,000 ఆస్తినష్టం జరిగిందని తెలిపారు. ఫైర్ సిబ్బంది సకాలంలో చేరుకుని మంటలను అదుపులోకి తీసుకు రావడంతో సుమారు రూ.5లక్షల విలువైన వస్తు సామాగ్రి ఆహుతి కాకుండా నిలువరించగలిగారు. కాగా మంటలు ఆర్పే క్రమంలో ఎస్.నాయుడు అనే వ్యక్తి చేతులు కాలిపోవటంతో ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

మాజీ మంత్రి గంటా వచ్చారు - వెళ్లారు !

అంతుబట్టని గంటా ఆంతర్యం అయోమయంలో ఆహ్వానితులు

విశాలాంధ్ర - వేపాడ: ప్రముఖ టీడీపీ నాయకుడు, రాష్ట్ర మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు మండలంలోని దబ్బిరాజుపేట గ్రామానికి మంగళవారం ఎందుకు వచ్చారో, ఎందుకు వెళ్లారో అర్థం కాక ఆహ్వానితులు అయోమయానికి గురయ్యారు. గ్రామదేవత శ్రీ దుర్గాలమ్మతల్లి పండగను పురస్కరించుకొని గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు పొట్నూరు రేవతి, తాడి కృష్ణ తదితరుల వినతి మేరకు టీడీపీ నేత గొంప కృష్ణ ఆహ్వానంపై దబ్బిరాజుపేటకు మాజీ మంత్రి గంటా 40కార్ల కాన్వాయ్‌తో అట్టహాసంగా విచ్చేసారు. దాంతో స్థానిక టీడీపీ కార్యకర్తల్లో ఆనందం నెలకొంది. కానీ ఆయన వచ్చీ రాగానే అమ్మవారి గుడిలోకి వెళ్లి దర్శనం చేసుకొని కొంతమంది అభిమానులతో సెల్ఫీలు తీయించుకొని నేరుగా వెళ్లి కారెక్కారు. స్థానిక నాయకులతో గాని, కార్యకర్తలతో గాని, ఆహ్వానితులతో గాని మాటా మంతి లేకుండా కారెక్కి వెళ్లిపోవడంతో అందరూ అసంతృప్తికి గురయ్యారు. అయితే మాజీ మంత్రిని పిలవగానే గ్రామానికి విచ్చేయడం ఒక విదంగా ఆనందమేనని కొంతమంది సంతృప్తి వ్యక్తం చేశారు. అయితే గ్రామంలో పెద్దల సమక్షంలో పండగ సందర్భంగా నిర్ణయించిన గ్రామ కట్టుబాట్లను వ్యతిరేకించి రాజకీయ కాటౌట్లను ఏర్పాటు చేయడం పట్ల గ్రామ పెద్ద వైకే నాయుడు అసంతృప్తి వ్యక్తం చేశారు. కాగా గంటా వెంట టీడీపీ నాయకులు గొంప కృష్ణ, గుమ్మడి భారతి, మంచిన అప్పలసూరి,శానాపతి గణేష్, సిరికి రమణ, గొర్రుపోటు వెంకటరమణ, చప్పగడ్డి జగన్, వై.సూర్యం, తుంబ అప్పారావు నియోజకవర్గంలోని గొరపల్లి రాము, రాయవరపు చంద్రశేఖర్, లగుడు రవికుమార్‌లతో పాటు సుమారు 200మంది నాయకులు కార్యకర్తలు హాజరయ్యారు.

బాల్య వివాహాలు చేస్తే పోలీస్ కేసులు

విశాలాంధ్ర - విజయనగరం క్రైమ్: రాష్ట్రంలో ఎక్కడైనా, ఎవ్వరైనా బాల్య వివాహాలు చేసిన యెడల వారిపై పోలీసులు కేసులు నమోదు చేయాలని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు తెలిపారు. విజయనగరం నగరపాలక కార్యాలయంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం బాల్య వివాహాలు జరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ వివాహ వయసు పాటించేలా చర్యలు చేపట్టాలని, వివాహ వయసు పాటించడం ద్వారా మహిళలు విద్యాపరంగా, ఆరోగ్య పరంగా అభివృద్ధి చెందడంతో పాటు కుటుంబానికి ఆసరాగా నిలుస్తారని అన్నారు. బాలికలు 18 సంవత్సరాల లోపు వివాహం చేసుకోవడం వల్ల పుట్టిన పిల్లలు అంగవైకల్యంతో పుట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్పర్సన్ హిమబిందు, మేయర్ విజయలక్ష్మి, ఒకటో పట్టణ సిఐ బెండు వెంకట్రావు, సిడిపిఓ ప్రసన్న, డిప్యూటీ మేయర్ రేవతి దేవి, కార్పొరేటర్లు సిడిపిఓ విజయ్ కుమారి, డిసిపిఓ సత్యనారాయణ, సూపర్ వైజర్లు మహిళ సంరక్షకులు, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఇజ్రాయిల్ కుటుంబానికి అండగా ఉంటాం

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: క్రికెట్ ఆడుతుండగా.. పిడుగుపాటుకు గురై మృతి చెందిన గాజులరేగకు చెందిన పి.ఇజ్రాయిల్ (21) కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని ఏపీ శాసనసభ ఉప సభాపతి, విజయనగరం నియోజకవర్గ ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి భరోసా ఇచ్చారు. మంగళవారం ఇజ్రాయిల్ మృతదేహాన్ని కొత్తపేట స్వర్గధామానికి కుటుంబ సభ్యులు, స్నేహితులు భారీ ర్యాలీగా తీసుకొచ్చారు. అక్కడకు చేరుకున్న కోలగట్ల.. ఇజ్రాయిల్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ప్రమాదానికి గల కారణాలపై కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అంత్యక్రియలకు కావాల్సిన ఏర్పాట్లు దగ్గరుండి చేయాలని పార్టీ నాయకులకు సూచించారు.

మన్యంలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి

విశాలాంధ్ర - సీతంపేట: మండలంలోని కోతం పంచాయతీ, కోతం, బెన్నడు గూడ గ్రామాలలో నియోజకవర్గ ఇంచార్జ్ నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో ఇదే ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులు మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో టీడీపీ హయాంలో అభివృద్ధి జరిగిందని, వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏ అభివృద్ధి లేదన్నారు. కార్యక్రమంలో ఇంచార్జ్ నిమ్మక జయక్రిష్ణ, నాయకులు నిమ్మక నాగేశ్వరరావు, పాలక ఆదినారాయణ, నిమ్మక చంద్రశేఖర్, జీలకర్ర మోహన్‌రావు, కోతాం గ్రామానికి చెందిన సవర గంగయ్య, మొఖలింగం, రవీంద్ర, సింహాచలం, రవి, నిలయ్య, నేరాడి సుందరరావు తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన సత్రాన్ని సందర్శించిన భద్రాచలం ఎస్ఐ

విశాలాంధ్ర - రేగిడి: వావిలవలస గ్రామంలో ఉన్న రాహుల్ సౌరబ్ నిత్య అన్నదాన సత్రాన్ని మంగళవారం భద్రాచలం ఎస్ఐ మధు కుటుంబ సమేతంగా సందర్శించారు. గత 1265 రోజులగా నిత్య అన్నదాన సత్రంలో భోజనాలు ఏర్పాట్లుతో పాటు మౌలిక సదుపాయాలు గురించి సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అనాథల ఆకలి తీరుస్తున్న సత్రం నిర్వాహకులు సిద్ధార్థను అభినందించి, తమవంతుగా ఆర్థిక సహాయాన్ని అందజేశారు. దాతలు సహకారాలు అందించాలన్నారు.

సమాజ సేవకురాలు సరస్వతికి సన్మానం

విశాలాంధ్ర - తెర్లాం/బాడంగి: బాడంగి మండలం ఆకులకట్టలో మంగళవారం సమాజ సేవకురాలు తెంటు సరస్వతికి సర్పంచ్ వుయ్యాల సత్యన్నారాయణ ఆధ్వర్యంలో సన్మానం చేశారు. గ్రామ అభివృద్ధికి దాతలు చేసిన సహకారం మరువలేని సర్పంచ్ సత్యన్నారాయణ కొనియాడారు. సరస్వతికి పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రావిపల్లి సింహాచలం నాయుడు, మత్స సింహాచలం, రాజాపు సత్యన్నారాయణ, జామి రాము, గంద్రేటి సన్యాసి, జామి పైడియ్య, ఉయ్యాల వీరయ్య, పంచాయితి కార్యదర్శి రమేష్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఉపాధి వేతనదారులతో ఉదయభాను ముచ్చట్లు

విశాలాంధ్ర - బలిజిపేట: మండలంలోని అరసాడ, రంగంపేట గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిహామీపథకం పనుల వద్దకు నియోజకవర్గ టీడీపీ సీనియర్ నాయకులు గర్భాపు ఉదయభాను వెళ్లి వేతనదారులతో పలు అంశాలపై ముచ్చటిస్తూ వారి సమస్యలను తెలుసుకొంటున్నారు. ఉపాధి హామీ పథకంకు మంచిరోజులు రావాలంటే టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిగా చేయడానికి మద్దతు ఇవ్వాలని కోరుతూ వారికి వేసవితాపాన్ని తగ్గించే టాటా గ్లోకోజ్ లను అందజేస్తున్నారు. నియోజక వర్గంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనులు జరిగేచోటుకు ప్రతీరోజు వెళ్లి టీడిపికు మద్దతు ఇవ్వాలని కోరుతూ తాను ముమ్మరంగా ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. గత నాలుగేళ్లుగా ఉపాధి హామీ పథకం పనులు జరిగే సమయంలో ఆయనను చూడగానే వేతనదారులు టాటా గ్లూకోజ్ అందజేసే నాయకుడు వస్తున్నారని చర్చించుకోవడం గమనార్హం. వ్యవసాయ రంగంలో ఉన్నతవిద్యనుఅభ్యసించి, సుదీర్ఘ కాలంగా వ్యవసాయఅధికారిగా పనిచేసిన ఉదయభాను 2013లో తన ఉద్యోగానికి రాజీనామా చేసి గతపదేళ్లుగా రాజకీయాల్లో ఉంటున్నారు.

పైడితల్లమ్మకు విశేష నైవేద్యాలు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: ఉత్తరాంధ్ర ఇలవేల్పు శ్రీ పైడితల్లమ్మ కు మంగళవారం విశేష నైవేద్యాలు సమర్పించారు. ఉదయం 5 గంటలకు అమ్మవారికి ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కే సుధారాణి ఆధ్వర్యంలో పంచామృతాభిషేకాలు నిర్వహించి, పూలాభిషేకం చేసి, బూరెలు, గారెలు తదితర నైవేద్యాలు సమర్పించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు సుదూర ప్రాంతంలో ఉన్న భక్తులంతా ఉదయం నుండే చదురు, వనం గుడిలవద్ద కు విచ్చేశారు. భక్తులకు ఆలయ పూజారి బంటుపల్లి వెంకట్రావు, అర్చకులు ఏడిద వెంకటరమణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయం వద్దకు విచ్చేసిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు చర్యలు చేపట్టారు.

ప్రభుత్వ అరాచకాలను ప్రజలు అర్ధం చేసుకోవాలి

మాజీ ఎమ్మెల్యే డా. కె.ఎ.నాయుడు

విశాలాంధ్ర - జామి: మండలంలోని వెన్నుపాడు, వెంకటరాజుపాలెం గ్రామాలలో మంగళవారం సాయంత్రం మండల పార్టీ అధ్యక్షులు పొలిపర్తి స్వామి నాయుడు ఆధ్వర్యంలో "ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి" కార్యక్రమం, రచ్చబండ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే డా.కే.ఏ.నాయుడు పాల్గొని ప్రజలతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను ప్రజలు అర్థం చేసుకోవాలని, రాష్ట్రంలో అభివృద్ధి లేదని, యువత రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తేనే మరలా అభివృద్ధి సాధ్యం అని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ కార్యదర్శి కొత్తలి సూర్యారావు,క్లస్టర్ ఇంఛార్జి సత్యన్నారాయణ, నియోజకవర్గ రైతు అధ్యక్షులు బోదంకి సన్యాసినాయుడు, పార్టీ నాయకులు రామ్మూర్తి, శ్రీను,జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

అంజనీ పుత్ర చిరంజీవి వాకర్స్ క్లబ్ సేవలు వెలకట్టలేనివి

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: అంజనీ పుత్ర చిరంజీవి వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో 42 వ డివిజన్ పరిధిలో అయ్యన్న పేట జంక్షన్ వద్దనున్న ఎస్సీ, బీసీ కాలనీలో నిర్వహిస్తున్న మజ్జిగ చలివేంద్రాన్ని వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ఎస్వీ రవీంద్ర మంగళవారం ఉదయం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంజనీ పుత్ర చిరంజీవి వాకర్స్ క్లబ్ సేవలు అభినందనీయమని, తెలుగు సినిమాకు పెద్ద దిక్కైన మెగాస్టార్ చిరంజీవి స్ఫూర్తితో పెట్టిన ఈ వాకర్స్ క్లబ్ సేవలు వెలకట్టలేనివని, అనతి కాలంలోనే అత్యధిక సేవా కార్యక్రమాలు చేపడుతూ పలు సేవా సంఘాలకు ఆదర్శంగా ఉందనటంలో అతిశయోక్తి కాదని క్లబ్ సేవలను కొనియాడారు. పలువురు పాదచారులకు మజ్జిగను ఆయన పంచిపెట్టారు. అనంతరం క్లబ్ వ్యవస్థాపకధ్యక్షుడు, జనసేన నాయకులు త్యాడ రామకృష్ణారావు(బాలు) డాక్టర్ ఎస్వీ రవీంద్రను మరియు క్లబ్ పెద్దలను సత్కరించారు.

ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ 102 గవర్నర్ కర్రోతు సత్యం, మాజీ గవర్నర్లు జి.కృష్ణం రాజు, కె.ఎర్నాయుడు, శ్రీ సాయి కృష్ణా వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు చెల్లూరి శ్రీనివాసరావు (సి.హెచ్.రమణ), బాలాజీ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు రామరాజు, క్లబ్ గౌరవ అధ్యక్షులు డాక్టర్ ఎ.ఎస్. ప్రకాశరావు మాస్టారు, క్లబ్ గౌరవ సలహాదారులు ఎ.తిరుపతిరావు, వాకార్స్ క్లబ్ పెద్దలు ఆర్.సి.హెచ్.అప్పల నాయుడు, తాడ్డి ఆదినారాయణ, పత్రి సాయి, యోగా గురువు చక్రధర్ పట్నాయక్, కోట్ల సత్యనారాయణ, నలమారాజు, తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు మొదలైన పటువర్ధనం రోడ్డు పనులు

విశాలాంధ్ర - వంగర: పటువర్ధనం, బాగింపేట రోడ్డు పనులు ఎట్టకేలకు ప్రారంభ మయ్యాయి. మడ్డువలస నిర్వాసిత గ్రామాల్లో పటువర్ధనం గ్రామం ఒకటి. నిర్వాసిత గ్రామాలు అన్నింటికీ స్థలాలు నాడు ఇళ్ళ స్థలాలు కల్పించారు. అక్కడ ఏదో విధంగా ప్రభుత్వం ఇచ్చిన కాలనీ ఇళ్లను మంజూరు చేశారు. నిర్వాసితులు వారికి కేటాయించిన స్థలాలు వద్దను కొత్తగా ఇళ్లను నిర్మించుకొని గ్రామాలను ఏర్పాటు చేసుకొన్నారు. పటువర్ధనం గ్రామస్థులకు పునరావాస, మౌలిక సదుపాయాలు కల్పించలేదు. కొత్తగా ఇళ్లస్థలాలను కేటాయించిన సంగతి విదితమే. అయితే 2019 లో నాటి టీడీపి పార్టీఅధికారంలో రూ. 2.29 లక్షలతో పటువర్ధనం నుండి బాగింపేట వరకూ తారు రోడ్డు మంజూరు చేశారు. 3.4 కిలోమీటర్ల పొడవున రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. కొంతమేర మెటల్ రోడ్డుపనులు పూర్తిచేశారు. తదుపరి ప్రభుత్వం మారటంతో నాటినుండి నేటి వరకూ చెల్లించకపోవటం వల్ల కాంట్రాక్టర్ ఎక్కడ పనులు అక్కడే నిలిపివేశారు. దీంతో పటువర్ధనం గ్రామ నిర్వాశితులు సరియైన రహదారి సౌకర్యం లేక నానా ఇబ్బందులకు గురవుతూ వచ్చారు. నాలుగేళ్ల అనంతరం పటువర్ధనం ప్రజలకు రోడ్డు సౌకర్యం కల్పించటానికి నడుం కట్టారు. కాంట్రాక్టర్ రోడ్డు పనులకు శ్రీకారం చుట్టారు.

ప్రస్తుతం పనులు జరుగుతున్నాయి. మంగళవారం పటువర్థం నుండి బా గింపేట రోడ్డు పనులను ఎం పీటీసీ,విప్ ప్రతినిధి తెంటు కుమారి, జోగి నాయుడు, రాము తదితరులు పరిశీలించారు.

ఉత్సాహంగా చిట్టంపాడు క్రికెట్ టోర్నీ

విశాలాంధ్ర - శృంగవరపుకోట: శృంగవరపుకోట మండలంలోని గిరిశిఖర గ్రామమైన బొడ్డవర పంచాయతీ శివారు చిట్టంపాడు గ్రామంలో మంగళవారం గిరిజన యువత అధ్వర్యంలో చిట్టంపాడు క్రికెట్ మెగా టోర్నమెంటు ప్రారంభమైంది. ఈ క్రికెట్ లీగ్‌ను గ్రామ పెద్దలతో పాటు గూనపాడు ప్రభుత్వ పాఠశాల హెచ్.ఎం చిప్పాడ సూరిబాబు టాస్ వేసి ప్రారంభించగా తొలిమ్యాచ్లో గూనపాడు కరకవలన జట్లు తలపడ్డాయి. ఈ క్రికెట్ ఈవెంట్ లో పాల్గొనే జట్లు విజయనగరం జిల్లా ఎస్.కోట మండల పరిధిలోని గిరిశిఖర గ్రామాలతో పాటు అల్లూరి సీతారామరాజు జిల్లా ప్రాంతం అనంతగిరి మండలంలోని గిరిశిఖర గ్రామాల జట్లు తలపడటం విశేషం. టోర్నీలో విజేతకు రూ.10వేలతో పాటు షీల్డ్ రన్నరప్‌కు నగదు బహుమతి అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వారం రోజుల పాటు ఈ టోర్నీ వుంటుందని, 14 జట్లు తలపడతాయని తెలిపారు. ఈ క్రికెట్ లీగ్ విజేతలకు ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, బొడ్డవర సర్పంచ్ మీనా నగదు బహుమతులను స్పాన్సర్ చేశారు. గ్రామ పెద్దలు మురళిరాజు, గిరిజన నేత కేత వీరన్న సహాయ సహకారాలు అందించారు.

సీతంలో విద్యార్థి సినిమా బృందం సందడి

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: స్థానిక గాజులరేగ పరిధిలో ఉన్న సీతం ఇంజనీరింగ్ కళాశాలలో మధు మాదాసు దర్శకత్వంలో నిర్మించబడ్డ విద్యార్థి సినిమా బృందము సీతం కళాశాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో చిత్ర దర్శకుడు మధు మాదాసు, చిత్ర కథానాయకుడు చేతన్ చీను ఇతర ముఖ్య పాత్రధారులు పాల్గొని సీతం కళాశాల విద్యార్థినీ ,విద్యార్థులను ఆట పాటలతో మాటలతో అలరించారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ మరియు కరస్పాండెంట్ డాక్టర్ బొత్స ఝాన్సీ లక్ష్మి ప్రత్యేకంగా రూపొందించిన పోస్టర్‌ను విడుదల చేస్తూ ఈ చిత్రం విద్యార్థులందరూ చూసి కుల మతాలకు అతీతంగా మానవత్వం అలవరచుకోవాలని, జీవితంలో ఎదురయ్యే ఒడిదుడుకులను సమర్థవంతంగా ఎదుర్కోవాలని అన్నారు. అలాగే ఈ చిత్రం అఖండ విజయం సాధించాలని కోరుకుంటూ చిత్ర కథానాయకుడు చేతన్‌కు, దర్శకునికి అభినందనలూ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశి భూషణ్‌రావు మాట్లాడుతూ ఈ సినిమా సందేశాత్మకమైనదని, విద్యార్థులంతా తప్పక చూడవలెనని పేర్కొన్నారు. చిత్ర దర్శకుడు కథానాయకుడూ స్పందిస్తూ ఎంతో వ్యయ ప్రయాసలకోర్చి విద్యార్థుల కోసం తీసిన చలనచిత్రమిది అని, సీతమ్ ఇంజనీరింగ్ కళాశాలలో అద్భుతమైన ఆదరణ లభించడం తమకెంతో సంతోషాన్నిచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. డి. వి. రామ మూర్తి, వివిధ విభాగాధిపతులు, ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జగనన్నే మా భవిష్యత్‌లో ఎమ్మెల్యే అలజంగి

విశాలాంధ్ర - బెలగాం : ఎమ్మెల్యే అలజంగి జోగారావు సారథ్యంలో వార్డు సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు, నాయకులతో కలిసి మంగళవారం 18వ రోజున "జగనన్నే మా భవిష్యత్తు" ప్రచార కార్యక్రమాన్ని మునిసిపాలిటీలోని 21వ వార్డు సుందర నారాయణపురం, వివేక్ కాలనీలో డోర్ టు డోర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రతీ గడపన ఎమ్మెల్యే జోగారావుకు పట్టణ ప్రజలు సాధర స్వాగతం పలుకగా ప్రతీ ఇంటి వద్ద గత ప్రభుత్వం చేసిన మోసాలు, ప్రస్తుత వైసీపీ ప్రభుత్వంలో జరుగుతున్న మేలు, అభివృద్ధి అంశాలను వారికి వివరించి మెగా పీపుల్ సర్వేలో వారి అభిప్రాయాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సిఎం వైయస్ జగన్ ప్రభుత్వం సాగించిన గత 45నెలల ప్రజా రంజక సుపరిపాలనపై ప్రజలంతా పూర్తి మద్దతును తెలుపుతూ భవిష్యత్లో కూడా మళ్లీ జగన్ పాలనే రావాలని కోరుకుంటూ కుటుంబ సమేతంగా ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గారితో పాటు పార్టీ పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, పట్టణ జెసిఎస్ కన్వీనర్ గొర్లి మాధవరావు, సచివాలయం కన్వీనర్లు చందాన ఆనంద్, సామల లలిత, ఆర్వీఎస్ కుమార్, నాయకులు జక్కు చిన్నంనాయుడు, గృహ సారథులు నీరస త్రినాథ, ఆవాల సాయి, భవాని, బి. రత్నం, వాలంటీర్లు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు

మలేరియా వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - సీతానగరం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని దోమలను అరికట్టగలిగితే మలేరియా వ్యాధిని నివారించడం సులభమని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ తెలిపారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా సీతానగరం, పెదంకలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, సిబ్బంది ఆద్వర్యంలో మంగళవారం ర్యాలీని నిర్వహించి నినాదాలు చేశారు. గత సంవత్సరం విస్తృతంగా నిర్వహించిన మలేరియా నిర్ధారణ పరీక్షల ఫలితంగా మలేరియా కేసులు పూర్తివివరాలు తెలిసాయని, వాటిని అరికట్టుటకు పటిష్ట చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. ప్రతీఒక్కరు దోమతెరలను వాడాలని, దోమలనివారణ పద్దతులను ఆచరించాలని తెలిపారు. మే 15 నుండి స్ప్రేయింగు కార్యక్రమం మొదలగు తుందని, స్ప్రేయింగుపై ప్రజలు అపోహలు వీడి విజయవంతం చేయాలని కోరారు. కార్య క్రమంలో వైద్యులు శిరీష, రాధాకాంత్, ఉషారాణిలు, ఈఓపిఆర్డీ కుమార్ వర్మ, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వేపాడ: సీజనల్ వ్యాధులలో భాగంగా మలేరియా వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వేపాడ బొద్దాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు ఏ. ధరణి, సతీష్ కుమార్‌లు అన్నారు. మంగళవారం జాతీయ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రమైన వేపాడలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో వైద్యాధికారిని ఏ. ధరణి సారథ్యంలో అలాగే బొద్దాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో వైద్యాధికారి సతీష్ కుమార్ ఆధ్వర్యంలో మలేరియా వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించే అవగాహన కల్పించారు. అలాగే మలేరియా వ్యాధిగ్రస్తులు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి సూచనలు సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ వి రమణ హెచ్ ఏ సాయి రెడ్డి, ఏఎన్ఎం బి లక్ష్మి, ఎం ఎల్ హెచ్ పి ఎస్ గమ్య ఆశలు తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : కొట్టాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఎస్.కోట గ్రామంలో ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని వైద్యాధికారి ఎం.హారిక, సీహెచ్ఓ ఎం.తారకరావుల ఆధ్వర్యంలో అవగాహనా ర్యాలీని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు దోమల వ్యాప్తికి కారణమైన నీటి నిల్వలు లేకుండా చేయడం, పరిసరాలను పరిశుభ్రముగా ఉంచుకోవడం, దోమ తెరలు వాడాలని సూచించారు. అందుకుగాను ప్రతి వారంలో ఒకసారి సిబ్బంది ద్వారా శుక్రవారం డ్రై డే నిర్వహించడం జరుగుతోందని వైద్యాధికారి హారిక వెల్లడించారు. ఈ సందర్భంగా సిబ్బంది దోమ పుట్టరాదు-దోమ కుట్టరాదు, ప్రజారోగ్యానికి దోమలు ప్రధాన శత్రువులు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచండి - దోమల వ్యాప్తిని అరికట్టండి అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్సీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, సూపర్ వైజర్లు, ఎంఎల్హెచ్పీలు, కె.రామసత్యం, శ్రీనివాసరావు, శంకరరావు, రామకృష్ణ, రాము తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ: మలేరియా జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ అరుణ్ కుమార్ నాయుడు అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా కొమరాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి కొమరాడ మెయిన్ రోడ్డు వరకు ప్రజలకు మలేరియా జ్వరాలపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి అరుణ్ కుమార్ నాయుడు మాట్లాడుతూ మన పరిసరాలు మన చుట్టూ ఉండే ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండాలని అప్పుడే మలేరియా జ్వరాలు రాకుండా ఉంటాయని అన్నారు. అలాగే ఎండలు తీవ్రతంగా ఉన్నాయి కాబట్టి వృద్ధులు, గర్భిణీలు, చిన్నపిల్లలు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పి హెచ్ ఎం అధికారి విజయ్ కుమారి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జామి: మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా మలేరియా వ్యాధిని రాకుండా నివారించుకోవచ్చని జామి పిహెచ్‌సి వైద్యాధికారిణి డా.ఎస్.భాగ్యరేఖ అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం గ్రామంలో ర్యాలీని, అవగాహనా సదస్సును సిబ్బందితో నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యాధికారిణి మాట్లాడుతూ నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని,, దోమలు వృద్ధి చెందకుండా చూడాలన్నారు. ప్రతీ శుక్రవారం డ్రైడేగా పాటించాలన్నారు. జ్వరం వచ్చిన వెంటనే రక్త పూత పరీక్షలను చేయించుకోవాలని సూచించారు. ర్యాలీలో మలేరియా వ్యాది నివారణా చర్యలపై నినాదాలు చేసారు. ఈర్యాలీలో హెచ్ఇ అనిల్ ప్రేమ్‌కుమార్, సిహెచ్‌వో ఫ్లారెన్స్, సూపర్‌వైజర్ భవానీ, సత్యనారాయణ, ఎఎన్ఎంలు లత, లక్ష్మి, చిన్నమ్మి,భూలక్ష్మి ఈశ్వరమ్మ, ఉమా తదితరులు పాల్గొన్నారు.

కురుపాం: మలేరియా నివారణకు ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎస్.నారాయణరావు అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం పురస్కరించుకొని మంగళవారం కురుపాం మేజర్ పంచాయతీ సచివాలయం నుండి బస్టాండ్ వరకు ప్రజా ప్రతినిధులు, వైద్య సిబ్బంది, సచివాలయం సిబ్బంది, విద్యార్థులతో



కలిసి భారీ ర్యాలీ నిర్వహించి మానవహారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియా నివారణకు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా దోమతెరను వాడి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని ప్రతి ఒక్కరు తప్పనిసరిగా వేడినీళ్లు తాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రావాడ రామభద్రపురం పీహెచ్‌సీ వైద్యాధికారి చీకటి శంకరరావు, మేజర్ పంచాయతీ సర్పంచ్ జి.సుజాత, ఉపసర్పంచ్ షేక్ ఆదిల్, ఎంపీటీసీలు బంగారు నాయుడు, టి.వి.స్వామి యాజులు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.శంకర్రావు, పంచాయతీ ఈవో కె.చంద్రశేఖర, సూపర్వైజర్లు కె.రాధాకృష్ణ, ఆదినారాయణ, వైద్య సిబ్బంది, వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

విశాలాంధ్ర - సీతానగరం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని దోమలను అరికట్టగలిగితే మలేరియా వ్యాధిని నివారించడం సులభమని, దానికోసం అంతా కలిసికట్టుగా పనిచేద్దామని సర్పంచులు,పంచాయతీ కార్యదర్శులు, సబ్ సెంటర్ల వైద్యసిబ్బంది ప్రతిజ్ఞలు, ర్యాలీలు నిర్వహించారు.ప్రపంచ మలేరియా దినోత్సవం సంధర్భంగా సీతానగరం, పెదంకలంప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిదిలోగల అన్నిసబ్ సెంటర్ల పరిదిలో మంగళవారంనాడు కార్యక్రమాన్ని నిర్వహించారు. మలేరియా దోమకాటువలన ఏర్పడుతుందని కావున ఇంటిలోన, ఇంటి పరిసరాలలలో నీరు నిలువఉండకుండా చూడాలని తెలిపారు. ఎవరికైనా జ్వరంవస్తే వెంటనే నిర్ధారణ పరీక్షలు చేయించుకొని, చికిత్స తీసుకోవాలన్నారు. ప్రతీఒక్కరు దోమతెరలను వాడాలని, దోమలనివారణ పద్దతులను ఆచరించాలని తెలిపారు. ఎంపిడిఒ ప్రసాద్,వైద్యులు శిరీష, రాధాకాంత్, ఉషారాణిలు, ఈఓపిఆర్డీ కుమార్ ల అదేశాలు మేరకు వైద్య సిబ్బంది ప్రతీ ఇంటికి వెళ్లి దీనిపై అవగాహన కల్పించాలని సూచించారు. ఇంటిలోపల కుండీలు, ఫ్రిజ్ లలో నీరు నిలువ ఉండకుండా చూడాలని, వాటర్ ట్యాంకు, సెప్టింక్ ట్యాంకులకు మూతలు, మెస్ లు కట్టుకోవాలని తెలిపారు. మనమంతా సామాజిక బాధ్యతగా గుర్తించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రతిజ్ఞ చేశారు.